నేడు యథావిధిగా పిజిఆర్ఎస్

కలెక్టర్ వెట్రిసెల్వి

ప్రజాశక్తి - ఏలూరు

ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పిజిఆర్ఎస్) ఈ నెల ఐదో తేదీ సోమవారం జిల్లా స్థాయితో పాటు మండల, డివిజనల్, మున్సిపల్ స్థాయిలో కూడా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ వెట్రిసెల్వి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు ఈ విషయాన్ని గమనించి తమ ఫిర్యాదులను సమీపంలోని మండల, డివిజనల్, మున్సిపల్ కార్యాలయాల్లో సమర్పించుకోవచ్చని తెలిపారు. ప్రజలకు పాలనను మరింత చేరువ చేయడానికి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను మండల, డివిజనల్, మున్సిపల్ స్థాయిలకు ప్రభుత్వం వికేంద్రీకరించినట్లు తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గుర్తించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

అకాల వర్షం.. అపార నష్టం..!

అన్నదాతను కుదిపేసిన ఈదురుగాలులు, వర్షం
నేలకొరిగిన చెట్లు, విద్యుత్ స్తంభాలు
రెండు జిల్లాల్లో వరి రైతుల అవస్థలు
పలుచోట్ల తడిసి ముద్దయిన ధాన్యం
దాదాపు ఆరులక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కల్లాల్లోనే
మామిడి రైతులకు కోలుకోలేని దెబ్బ
అకాల వర్షాలకు ఏలూరు జిల్లాలో ఇద్దరు మృతి

ఉంగుటూరు మండలం తిమ్మయ్యపాలెంలో వర్షానికి తడిసిన ధాన్యం బస్తాలు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

రెండు జిల్లాల్లోనూ ఆదివారం ఉదయం ఆకాల వర్షం, ఈదురుగాలులు బీభత్సం సృష్టించాయి. రైతులకు తీవ్ర కష్టాన్ని, నష్టాన్ని మిగల్చగా, రోడ్లపై నేలకొరిగిన చెట్లు, విద్యుత్ స్తంభాలతో జనం నానా యాతయన పడ్డారు. ఏలూరు జిల్లాలో సరాసరి వర్షపాతం 25.4 మిల్లీమీటర్లు నమోదు కాగా, ముసునూరు మండలంలో అత్యధికంగా 66.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. లింగపాలెం, ముదినేపల్లి, చాట్రాయి వంటి మండల్లాలోనే పెద్దఎత్తున వర్షం పడిన పరిస్థితి నెలకొంది. నడివేసవిలో వెంటాడిన అకాల ప్రకృతి వైపరీత్యంతో ముఖ్యంగా అన్నదాత తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న పరిస్థితి నెలకొంది. ఏలూరు జిల్లా వ్యాప్తంగా రబీలో 3.92 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనావేయగా ఇప్పటివరకూ కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలు చేసిన ధాన్యం రెండు లక్షల టన్నుల వరకూ ఉంది. ఇంకా దాదాపు లక్షన్నర టన్నులకుపైగా ధాన్యం కల్లాల్లోనే ఉంది. పశ్చిమగోదావరి జిల్లాలో తొమ్మిది లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి అంచనా వేయగా ఇప్పటి వరకూ 4.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రమే కొనుగోలు జరిగింది. రెండు జిల్లాల్లోనూ దాదాపు ఆరు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఇంకా రైతుల వద్ద కల్లాల్లోనే ఉన్న పరిస్థితి. టార్గెట్లు పూర్తయ్యాయంటూ వేగంగా ధాన్యం కొనుగోలు సాగకపోవడం వంటి కారణాలు సైతం ధాన్యం ఎక్కువగా కల్లాలో ఉండటానికి కారణంగా చెప్పొచ్చు. అకాల వర్షంతో కల్లాలో బస్తాలతో ఉన్న ధాన్యం సైతం తడిసి ముద్దయిన పరిస్థితి. ధాన్యం తడవకుండా కాపాడుకునేందుకు రైతులు పడ్డ ఇబ్బందులు వర్ణాతీతంగా మారాయి. వేగంగా ధాన్యం కొనుగోలు చేస్తే తప్ప రైతులకు కష్టాలు తీరే పరిస్థితి కనిపించడం లేదు.

మామిడి రైతులకు కోలుకోలేని దెబ్బ..

అకాల వర్షాలు, ఈదురుగాలులు మామిడి రైతును కోలుకోలేని దెబ్బతీస్తున్నాయి. ఏలూరు జిల్లాలో దాదాపు 50వేలకు పైగా ఎకరాల్లో మామిడిపంట సాగవుతోంది. రైతులు పెద్దఎత్తున పెట్టుబడులు పెట్టారు. పంట చివరిదశకు చేరిన తరుణంలో ఈదురుగాలులకు మామిడికాయలు రాలిపోవడంతో రైతులు తీవ్ర నష్టాలను చవిచూస్తున్నారు. అంతేకాకుండా వర్షాలకు బంగినపల్లితోపాటు ఇతర రకాల మామిడి పండ్లలో పురుగు చేరే అవకాశం ఉండడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. పొగాకు, మొక్కజొన్న రైతులు సైతం వర్షాలకు ఇబ్బందులు పడుతున్న పరిస్థితి.

నేలకొరిగిన చెట్లు, విద్యుత్ స్తంభాలు

భారీ వర్షాలు, ఈదురుగాలులకు పలు ప్రాంతాల్లో చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. ఏలూరు నగరం, భీమడోలు మండలం గుండుగొలను, ద్వారకాతిరుమల, జంగారెడ్డిగూడెం, చింతలపూడి, న్యూజివీడుతోపాటు పలుప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలు పడిపోవడంతో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. వెంటనే అధికారులు స్పందించి జెసిబిల సాయంతో రోడ్లపై అడ్డుగా పడిన చెట్లను తొలగించి ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చేశారు.

అకాల వర్షాలకు ఇద్దరు మృతి

ఈదురు గాలులు, భారీ వర్షానికి రేకుల షెడ్డుపై భారీ వక్షం కూలి పడడంతో ముసునూరు మండలం చెక్కపల్లిలో బాలుడు మృతి చెందాడు. చెక్కపల్లి గ్రామానికి చెందిన మామిళ్ల మారేశ్వరరావు బిసి ఏరియాలోని దెబ్బగూడెం వీధిలో చెరువు కట్టపై రేకుల షెడ్డులో ఉంటున్నాడు. ఈదురు గాలులకు ఇంటి పక్కన ఉన్న (ఎలగ చెట్టు) భారీ వృక్షం ఆ రేకుల షెడ్డుపై పడడంతో మారేశ్వరరావు కుమారుడు మామిళ్ల బాల గోవింద్(బాలుడు) ప్రమాద స్థలంలోనే మృతి చెందారు. ఆ ఇంటి స్థలంలో వరండాలో ఉన్న తండ్రి మారేశ్వరరావు, తల్లి, ఇద్దరు అక్కలు క్షేమంగా బయటపడ్డారు. ఒక్కగానొక్క కొడుకు బాల గోవింద్ ఏడో తరగతి చదువుతున్నాడు. కళ్ల ఎదుటే కొడుకు మృతి చెందడంతో ఆ కుటుంబం కన్నీరు మున్నీరయ్యారు. అకాల వర్షం ఈదురుగాలులతో విద్యుత్ షాకుకు గురై దెందులూరు గ్రామంలోని పెద్ద దళితవాడకు చెందిన తానికొండ జార్జి మృతిచెందాడు. జార్జి తాపీ పని చేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. వర్షం రావడంతో పనికి వెళ్లలేదు. దీంతో ఇంటిముందు సర్వీస్ వైర్ గుమ్మం ముందు తెగిపడడంతో గుర్తించని జార్జి ఇంటి బయటకు రావడంతో విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. భార్య దెందులూరు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకురాగా అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు తెలిపారు.

ప్రశాంతంగా నీట్

1162 మంది విద్యార్థులు హాజరు : కలెక్టర్ వెట్రిసెల్వి

పత్రాలను పరిశీలిస్తున్న పోలీసు అధికారులు

విద్యార్థి చెవి దిద్దులు తేసేస్తున్న తల్లి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఏలూరు జిల్లాలో 5 పరీక్ష కేంద్రాల్లో ఆదివారం నిర్వహించిన నీట్ ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా జరిగిందని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి తెలిపారు. ఈ మేరకు పరీక్ష మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5.00 గంటల వరకూ కొనసాగింది. అయితే విద్యార్థులను 11 గంటల నుంచే పరీక్షా కేంద్రంలోకి అనుమతించారు. లోపలికి అనుమతించే క్రమంలో విద్యార్థినులను క్షుణ్ణంగా పరిశీలించారు. జిల్లాలో మొత్తం 5 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. మొత్తం 1,200 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా ఇందులో 1,162 మంది హాజరవ్వగా, మరో 38 మంది పరీక్షకు హాజరుకాలేదు. ప్రభుత్వం జూనియర్ కళాశాల, కోటదిబ్బ పరీక్షా కేంద్రంలో 240 మందికి గాను 232 మంది, కస్తూరిబా మున్సిపల్ బాలికల ఉన్నత పాఠశాల, కోటదిబ్బ పరీక్షా కేంద్రంలో 360 మందికి గాను 347 మంది, సుబ్బమ్మదేవి మున్సిపల్ హైస్కూల్, ఆర్ఆర్‌పేట పరీక్షా కేంద్రంలో 240 మందికి 234 మంది, కేంద్రీయ విద్యాలయ, గోపన్నపాలెం పరీక్షా కేంద్రంలో 240 మందికి 235 మంది, ప్రభుత్వం ఉన్నత పాఠశాల, గోపన్న పాలెం, పరీక్షా కేంద్రంలో 120 మందికి గాను 114 మంది హాజరయ్యారు.

జిల్లా మొత్తం మీద ఐదు పరీక్షా కేంద్రాలు మాత్రమే ఉండడంతో జిల్లా నలుమూలల నుంచి విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు చేరుకోవడంతో చాలా మంది విద్యార్థులకు ఆలస్యమైంది. చివరి నిమిషం వరకూ విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు చేరుకుంటూనే ఉన్నారు. దీనికి తోడు అడ్మిట్ కార్డ్, ఒరిజినల్ ఆధార్ కార్డ్, ఒక పోస్ట్ కార్డ్ సైజ్ ఫోటోగ్రాఫ్, రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు కచ్చితంగా తీసుకురావాల్సిన అవసరం ఉండడంతో చాలామంది కొన్ని తెస్తే కొన్ని మర్చిపోవడం వల్ల వారి తల్లిదండ్రులు ఇంటికి వెళ్లి మరీ ఆధార్ కార్డు వంటివి తీసుకురావాల్సి వచ్చింది. అలాగే ఎలక్ట్రానిక్ గాడ్జెట్స్‌తో పాటు చెవి దిద్దులు, ఉంగరాలు, పట్టీలు వంటివి ఉండకూడదని ముందే చెప్పినప్పటికీ చాలామంది వాటిని ధరించిరావడంతో గేటు దగ్గర ఉన్న పోలీసులు వాటిని తీయించి పరీక్షా హాల్లోకి పంపించారు. జడకు ఉన్న క్లిప్పులు సైతం తీయించేశారు. పరీక్షా కేంద్రాల వద్ద ఎటువంటి మొబైల్ సిగ్నల్స్ పనిచేయకుండా ఈసారి జామర్లు కూడా ఏర్పాటు చేయడం విశేషం.

నిరీక్షణకు ఫలితమిదేనా..!

ఇళ్ల స్థలాల కోసం 39 ఏళ్ల నుంచి ఎదురుచూస్తున్న ఎఎస్ఆర్.నగర్ వాసులు
స్థలాలివ్వకుండానే ఉన్న ఇళ్లను తొలగించేందుకు అధికారులు సిద్ధం
కోర్టును ఆశ్రయించిన 53 కుటుంబాలు
స్టే విధించి యథావిధిగా గృహాలు ఉంచాలని ఆదేశాలిచ్చిన కోర్టు
ఎన్నిసార్లు దరఖాస్తు చేసుకున్నా ఫలితం శూన్యం
ఎఎస్ఆర్ నగర్‌లోనే నివాసం ఉంటాం : నివాసితులు

ఇళ్లు తొలగిస్తున్న దృశ్యం (ఫైల్‌ఫొటో)

ప్రజాశక్తి - భీమవరం

వాళ్లంతా రెక్కాడితే గాని డొక్కాడని నిరుపేదలు. నివసించేందుకు జానెడు జాగా కూడా లేదు. ప్రభుత్వం స్థలం మంజూరు చేస్తుందేమోనని చూసినా ఫలితం లేదు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ స్థలంలోనే నివాసాలు ఏర్పాటు చేసుకుని 39 ఏళ్ల నుంచి జీవనం సాగిస్తున్న ఆ నిరుపేద కుటుంబాల ఇళ్లను కాలుష్యం పేరుతో కూల్చేందుకు అధికార యంత్రాంగం సిద్ధమైంది. ఈ నేపథ్యంలో 53 కుటుంబాలు కోర్టును ఆశ్రయించాయి. దీంతో కోర్టు ఆ గృహాలకు స్టే విధించి యథావిధిగా ఉంచాలని ఆదేశించింది. అయితే లక్షలాది రూపాయలు వెచ్చించి నిర్మించుకున్న ఇళ్లు ఏ క్షణాన ఏం జరుగుతుందోనని ఎఎస్ఆర్.నగర్ వాసులు భయం గుప్పెట్లో జీవనం గడుపుతున్నారు.

పాలకోడేరు ఎఎస్ఆర్.నగర్‌లో 39 ఏళ్ల నుంచి పేదలు నివసిస్తున్నారు. కేవలం కొద్ది మందికి మాత్రమే పట్టాలిచ్చారు. మిగిలిన వారికి రకరకాల కారణాలు చూపి మొండిచేయి చూపారు. సుమారు 108 కుటుంబాలు ఇక్కడే నివసిస్తున్నాయి. అయితే గత వైసిపి ప్రభుత్వం హయాంలో పాలకోడేరులో ఏర్పాటుచేసిన రెండు ప్రభుత్వ కాలనీల్లో 62 మందికి ఇళ్ల పట్టాలు మంజూరు చేశారు. వాటిలో 9 పట్టాలకు సంబంధించి భూమి కోర్టు వివాదంలో ఉంది. మిగిలిన 53 మందికి అసలు ఇళ్ల పట్టాలు లేవు. అయితే నివాసాలు కూడా అరకొరగానే చేసుకున్నారు. దీనికి అనేక కారణాలు ఉన్నాయి. ప్రభుత్వ లేఅవుట్‌లో కనీసం మౌలిక వసతులు పూర్తిస్థాయిలో కల్పించలేదు. ముఖ్యంగా తాగునీరు, విద్యుత్, డ్రెయినేజీ వంటి సౌకర్యాలు కూడా అంతంతమాత్రమే ఉన్నాయి. లేఅవుట్‌కు వెళ్లేందుకు ప్రధానంగా దారి సమస్య ఒకటి ఉంటే లేఅవుట్ మట్టి పూడిక నామమాత్రంగా చేసి వదిలేశారు. దీంతో చిన్నపాటి వర్షం వచ్చినా మోకాళ్లలోతు నీరుచేరి నడిచేందుకు దారి లేని పరిస్థితి. ఈ నేపథ్యంలో ఇక్కడ నివాసం ఉంటున్న వారు ప్రభుత్వ లేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణానికి మక్కువ చూప లేదు. దీనికి తోడు ఆర్థిక పరిస్థితులు సహకారం కూడా లేకపోవడంతో ఇళ్లు నిర్మించుకోలేదు. అయితే ఇదిలా ఉంటే 53 కుటుంబాలకు అసలు ఇళ్ల స్థలాలే లేవు. ఇంటి స్థలం కోసం అనేకసార్లు దరఖాస్తు చేసుకున్నా స్థలాలు మంజూరు కాలేదు. అధికారులను అడగ్గా అదిగో వస్తుంది. ఇదిగో వస్తుందని చెప్పడమే తప్ప ఇళ్ల స్థలాలు ఇచ్చిన దాఖలాలు లేవు. అయితే గత ప్రభుత్వ హయాంలో ఇళ్ల స్థలాలు కేటాయించిన సందర్భంలో వీరందరికీ ఇళ్లు ఉన్నట్లు ఎఎస్ఆర్ నగర్లో నివాసం ఉంటున్నట్లు చూపించి ఇళ్ల స్థలాలు కేటాయించలేదు. అయితే ప్రస్తుతం రాజు కాలువ కలుషితం పేరుతో ఈ గట్టును ఆనుకుని నివసిస్తున్న పేదల ఇళ్లన్నీ తొలగింపు చర్యలు చేపట్టి 42 ఇళ్లను నిర్ధాక్షణ్యంగా కూల్చివేశారు. ఈ నేపథ్యంలో 53 కుటుంబాలు తమకు ఎటువంటి ఇళ్ల స్థలాలు ప్రభుత్వం ఇవ్వలేదని, ఈ ఇంటి ... ఆధారంగా జీవిస్తున్నామని కోర్టును ఆశ్రయించాయి. దీంతో కోర్టు స్టే విధించి ఇళ్లను యథావిధిగా ఉంచాలని ఆదేశాలు జారీ చేసింది. అసలు ప్రభుత్వం ఈ 53 కుటుంబాలకు ఎటువంటి స్థలాలు ఇవ్వకుండానే ప్రస్తుతం నివాసం ఉంటున్న ఇళ్లను తొలగిస్తామని చెప్పడం నిరుపేదల కుటుంబాల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ఇళ్ల స్థలాలు మంజూరు చేసే ముందు ఇళ్లు ఉన్నాయని చెప్పి ఇళ్ల స్థలాలు ఇవ్వకుండా ఇప్పుడు ఎటువంటి ఇళ్ల స్థలాలు లేకుండానే ఉన్న ఇంటిని కూల్చేస్తామని చెబుతుండడం ఎంతవరకూ సమంజసమని పలువురు ప్రశ్నిస్తున్నారు.

ఇల్లు ఉంది కదా స్థలం ఎందుకు అన్నారు

జి.లక్ష్మి, నివాసితురాలు, ఎఎస్ఆర్.నగర్

నా భర్త సత్యనారాయణతో కలిసి ముగ్గురు పిల్లలతో 40 ఏళ్ల నుంచి ఇక్కడే ఉంటున్నాం. రూపాయి రూపాయి కూడబెట్టి రూ.4 లక్షలు వెచ్చించి రేకుల షెడ్డువేసి ఇంటిని ఏర్పాటు చేసుకున్నాం. ఇళ్ల స్థలానికి దరఖాస్తు చేసుకుంటే నీకు ఇల్లు ఉంది కదా అని స్థలం రాదు అని అధికారులు చెప్పారు. ఇప్పుడున్న ఇంటిని తొలగిస్తామని చెబుతున్నారు. స్థలం ఇవ్వకుండా కట్టుకున్న ఇల్లు తొలగిస్తే ముగ్గురు పిల్లలతోఎక్కడికి వెళ్లాలి, ఎలా బతకాలి.

మూడు సార్లు కోర్టు స్టే తెచ్చుకున్నాం..

దొంగ నాగలక్ష్మి, నివాసితురాలు, ఎఎస్ఆర్.నగర్

నా భర్త నాగయ్య వ్యవసాయ కూలీ, మాకు ఇద్దరు పిల్లలు. మూడేళ్ల క్రితం రేకుల షెడ్డు నిర్మించుకున్నాం. ఇంటి కోసం చేసిన అప్పు ఇంకా తీరలేదు. ఇల్లు తొలగిస్తామని అధికారులు చెబితే మొదటిసారి కోర్టుకు వెళ్లాం. తొలగింపు కొన్ని రోజులు ఆగింది. మరోసారి అధికారులు నోటీసులు ఇచ్చారు. మళ్లీ మేము కోర్టుకు వెళ్లాం. ఇలా మూడుసార్లు కొట్టుకు వెళ్లి స్టే తెచ్చుకున్నాం. అయినా మా ఇంటిని కూడా కూల్చేస్తాం అని చెప్పడం ఎంతవరకూ సమంజసం.

ఎక్కడికి వెళ్లే ప్రసక్తే లేదు..

జోగి లక్ష్మి, నివాసితురాలు, ఎఎస్ఆర్.నగర్

40 ఏళ్ల నుంచి ఇక్కడే ఉంటున్నాం. ఉన్నట్టుండి ఇల్లు తొలగిస్తాం మీరు వెళ్లిపోండి అంటే ఎక్కడికి వెళ్తాం. ఉన్న ఇంటిని వదిలి వెళ్లాలంటే కష్టంగా ఉంది. ఉన్నదంతా ఈ ఇంటి నిర్మాణానికి పెట్టాం. మాకు వేరేచోట స్థలం ఇస్తానన్నా వెళ్లే ప్రసక్తే లేదు. మేము ఎప్పటినుంచో ఇక్కడే ఉంటున్నాం. ఇక్కడే ఉంటాం. అన్యాయంగా ఇల్లు ఖాళీ చేసి వెళ్లిపోమంటే ఎక్కడికి వెళ్తాం.

ఇళ్ల స్థలానికి నాలుగు సార్లు దరఖాస్తు చేశాను

గుత్తుల నాగమణి, నివాసితురాలు, ఎఎస్ఆర్.నగర్

రోజువారీ వ్యవసాయ కూలి పనులకు వెళ్లడం తప్ప వేరే ఆధారం మాకు లేదు. కూలి డబ్బులు కొంత మొత్తం దాచుకుని మిగతాది అప్పు చేసుకుని రూ.4 లక్షలతో రేకుల షెడ్డు నిర్మించుకున్నాం. గత ప్రభుత్వ ఐదేళ్ల కాలంలో నాలుగు సార్లు ఇంటి స్థలానికి దరఖాస్తు పెట్టుకున్నాను. అయినా స్థలం మంజూరు చేయలేదు. ఎందుకు చేయలేదని అడిగినా ఎవరూ పట్టించుకోలేదు. ఇంత దారుణంగా వ్యవహరిస్తారని అసలు గ్రహించలేదు.

విద్యార్థులు పుస్తక పఠనం చేసేలా కృషి

గ్రంథాలయ సంస్థ ఆధీనంలో వేసవి విజ్ఞాన శిబిరాలు
ఉమ్మడి జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఎం.శేఖర్ బాబు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

విద్యార్థుల్లో పుస్తక పఠనం అలవాటు చేసేందుకు జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధీనంలో వేసవి విజ్ఞాన శిబిరాలు నిర్వహిస్తున్నామని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి, జిల్లా గ్రంథాలయ అధికారి ఎం.శేఖర్ బాబు తెలిపారు. జిల్లాలో ఎన్ని గ్రంథాలయాలు ఉన్నాయి, సక్రమంగా గ్రంథాలయాలకు రావాల్సిన సెస్సు వసూలు అవుతుందా, గ్రంథాలయాలకు ప్రభుత్వం నుంచి ఏమైనా నిధులు వస్తున్నాయా వంటి ప్రశ్నలకు ప్రజాశక్తి జరిపిన ముఖాముఖిలో ఆయన సమాధానాలు ఇచ్చారు.

ప్రశ్న : జిల్లాలో గ్రంథాలయ సంస్థ ఆధీనంలో ఎన్ని గ్రంథాలయాలు ఉన్నాయి? ఎంతమంది సభ్యత్వదారులు ఉన్నారు? ఎన్ని పుస్తకాలు ఉన్నాయి?

అధికారి : ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధీనంలో ఒక జిల్లా కేంద్ర గ్రంథాలయం, ఐదు ప్రథమ శ్రేణి గ్రంథాలయాలు, రెండు ద్వితీయ శ్రేణి గ్రంథాలయాలు, 66 తృతీయ శ్రేణి గ్రంథాలయాలు, రెండు గ్రామీణ గ్రంథాలయాలు ఉన్నాయి. అలాగే గ్రామీణ ప్రాంతాల్లో గ్రంథాలయాలు లేని చోట పుస్తక పంపిణీ కేంద్రాలు నిర్వహించి పాఠకులకు సేవలందిస్తున్నాం. అలాంటివి 75 పుస్తక పంపిణీ కేంద్రాలు నిర్వహిస్తున్నాం. ఈ గ్రంథాలయాల్లో 1,14,482 మంది సభ్యత దారులు ఉన్నారు. అలాగే 10,54,432 పుస్తకాలు పాఠకులకు అందుబాటులో ఉన్నాయి.

ప్రశ్న : గ్రంథాలయాల్లో పుస్తకాల కొనుగోలుకు గాని, ఇతర నిర్వహణకు గాని ప్రభుత్వం నుంచి నిధులు ఏమైనా వస్తున్నాయా? చివరిసారి ఎప్పుడు పుస్తకాలు కొన్నారు?

అధికారి : పుస్తకాల కొనుగోలుకు ప్రభుత్వం నుంచి ఎలాంటి నిధులు రావు. మున్సిపల్ కార్పొరేషన్, మున్సిపాలిటీలు, పంచాయతీల నుంచి వచ్చే సెస్సు ఆధారంగా పుస్తకాలు కొనుగోలు చేయాల్సి ఉంటుంది. ప్రతి ఏడాది ఆ నిధుల నుంచి సుమారు రూ.30 లక్షలతో గ్రంథాలయాల్లో దిన, వార, పక్ష, మాసపత్రికలు కొనుగోలు చేసి పాఠకులకు అందుబాటులో ఉంచుతాం. చివరిసారి 2022లో పుస్తకాలు కొనుగోలు చేశాం.

ప్రశ్న : పోటీ పరీక్షలకు కావాల్సిన పుస్తకాలు ఎలా కొంటున్నారు?

అధికారి : ఎవరైనా దాతలు సహకరిస్తే పోటీ పరీక్షలకు కావాల్సిన పుస్తకాలు కొంటున్నాం. గత ఫిబ్రవరిలో దాతల సహకారంతో రూ.30 వేల విలువైన పుస్తకాలు కొనుగోలు చేశాం. 2023-24లో రూ.58,274 విలువైన పాఠకులు కోరిన పోటీ పరీక్షల పుస్తకాలను కొనుగోలు చేసి వారికి అందుబాటులో ఉంచాం.

ప్రశ్న : పిల్లల్లో, విద్యార్థుల్లో పుస్తక పఠనం పట్ల ఆసక్తి పెంపొందించడానికి, గ్రంథాలయాలు అలవాటు చేయడానికి ఎలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు?

అధికారి : పిల్లల్లో, విద్యార్థుల్లో పుస్తక పఠనం అలవాటు చేయడానికి ప్రతి ఏడాది వేసవి సెలవుల్లో వేసవి విజ్ఞాన శిబిరాలు నిర్వహిస్తున్నాం. అన్ని గ్రంథాలయాల్లో వివిధ పాఠశాలల నుంచి వచ్చిన విద్యార్థులకు వివిధ రంగాల్లో నిష్ణాతులైన గురువులచే పుస్తక పఠనం, పుస్తక సమీక్ష, యోగా, సంగీతం, స్పోకెన్ ఇంగ్లీష్, డ్రాయింగ్ వంటివి నేర్పిస్తున్నాం. 2024- 25లో సుమారు 22,439 మంది విద్యార్థులు సమ్మర్ క్యాంపునకు హాజరయ్యారు. ప్రతి ఏడాది నవంబర్ 14 నుంచి 20వ తేదీ వరకు జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు అన్ని గ్రంథాలయాల్లో నిర్వహించి సెమినార్లు, సదస్సుల ద్వారా గ్రంథాలయాల ఆవశ్యకతను తెలియజేస్తున్నాం. జిల్లాలోని అన్ని గ్రంథాలయాల్లో ప్రతి ఆదివారం చదవడం మాకిష్టం అనే కార్యక్రమాన్ని నిర్వహించి పాఠశాల విద్యార్థులతో పుస్తక పఠనం చేయిస్తున్నాం.

ప్రశ్న : జిల్లాలోని ఎన్ని గ్రంథాలయాలకు సొంత భవనాలు ఉన్నాయి?

అధికారి : జిల్లాలో 58 గ్రంథాలయాలు సొంతభవనాల్లో ఉండగా ఎనిమిది గ్రంథాలయాలు అద్దె లేని ఉచిత భవనాల్లో, మరో ఎనిమిది గ్రంథాలయాలు అద్దె భవనాల్లో ఉన్నాయి.

ప్రశ్న : జిల్లా గ్రంథాలయానికి రోజు ఎంత మంది పాఠకులు వస్తారు? జిల్లా గ్రంథాలయం శిథిలావస్థకు చేరుకున్న తరుణంలో కొత్త భవన నిర్మాణానికి ప్రపోజల్స్ ఏమైనా పంపారా? నిధులు ఏమైనా మంజూరయ్యాయా?

అధికారి : జిల్లా గ్రంథాలయానికి ప్రతిరోజూ సుమారు 400 మంది పాఠకులు వచ్చి వివిధ పోటీ పరీక్షలకు అవసరమైన పుస్తకాలు చదువుకుంటూ ఉంటారు. భవనం శిథిలావస్థకు చేరుకుని స్లాబులు పెచ్చులు ఊడిపోతున్నాయని ప్రభుత్వానికి తెలియజేశాం. కాని ఇప్పటివరకు కొత్త భవనం మంజూరు కాలేదు. ఎలాంటి నిధులు మంజూరు కాలేదు.

ప్రశ్న : గ్రంథాలయాల నిర్వహణకు ప్రధాన ఆదాయ వనరు అయిన సెస్ ఇప్పటికీ ఎంత పెండింగ్ ఉంది? ఎందుకు వసూలు కావడం లేదు? వసూలుకు ఎలాంటి ప్రయత్నాలు చేస్తున్నారు?

అధికారి : వివిధ మున్సిపాలిటీలు, ఏలూరు మున్సిపల్ కార్పొరేషన్, జిల్లాలోని పంచాయతీల నుంచి సుమారు రూ.20 కోట్ల సెస్సు బకాయి ఉంది. ఒక ఏలూరు మున్సిపల్ కార్పొరేషన్ నుంచి రూ.11 కోట్ల బకాయి ఉంది. 1960 పౌర గ్రంథాలయ చట్టంలోని సెక్షన్ 20 (1) ప్రకారం జిల్లాలోని మున్సిపాలిటీలు, స్థానిక సంస్థలు వసూలు చేసిన ఆస్తి పన్నులో రూపాయికి ఎనిమిది పైసలు వసూలు చేసిన నెల రోజుల్లోనే గ్రంథాలయ సెస్సుగా గ్రంథాలయాలకు జమ చేయాల్సి ఉంది. అయితే స్థానిక సంస్థలు ఆస్తి పన్నులు సకాలంలో, సక్రమంగా వసూలు చేసుకుంటున్నప్పటికీ గ్రంథాలయాలకు కట్టాల్సిన సొమ్ము కట్టడం లేదు. ఈ విషయంలో ప్రతిరోజు పంచాయతీలు మున్సిపల్ కార్యాలయాల చుట్టూ తిరుగుతూ లేఖలు ఇస్తున్నాం. జిల్లా జాయింట్ కలెక్టర్ దృష్టికి కూడా తీసుకెళ్లాం. అయినప్పటికీ ఫలితం ఉండటం లేదు. గత డిసెంబర్‌లో ఏలూరు కార్పొరేషన్ నుంచి రూ.11 కోట్లకు కేవలం రూ.20 లక్షలు జమ చేశారు. ఈ విషయంలో ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

ప్రశ్న : చివరిగా పాఠకులకు, విద్యార్థులకు, అధికారులకు మీరిచ్చే సూచన ఏమిటి?

అధికారి : ఈ వేసవిలో విద్యార్థులు గ్రంథాలయ సంస్థ నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాల్లో విరివిగా పాల్గొని పుస్తక పఠనంతో పాటు అనేక విషయాలు నేర్చుకోవాలని కోరుతున్నాను. స్థానిక సంస్థల అధికారులు సకాలంలో గ్రంథాలయ సెస్సు చెల్లించి, ప్రస్తుతం డిఎస్‌సి వంటి పోటీ పరీక్షలు ఉన్న తరుణంలో గ్రంథాలయాల అభివృద్ధికి, పుస్తకాల కొనుగోలుకు తోడ్పడాలని కోరుతున్నాను. అలాగే దాతలు ముందుకొచ్చి పోటీ పరీక్షలకు కావాల్సిన పుస్తకాలు పాఠకులకు అందించాలని కోరుతున్నాను.

నేడు పాలగూడెంలో షర్మిల పర్యటన

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల సోమవారం మధ్యాహ్నం 3.30 గంటలకు దెందులూరు నియోజకవర్గం పాలగూడెంలో పర్యటించనున్నారు. గ్రామ పంచాయతీ పరిధిలోని రైతుసేవా కేంద్రానికి ఎదురుగా ఉన్న పొలాల్లో అకాల వర్షాలకు కల్లాల్లో తడిసి ముద్దయిన ధాన్యాన్ని పరిశీలించి రైతులను ఆమె పరామర్శించనున్నట్లు ఏలూరు జిల్లా కాంగ్రెస్ నాయకులు తెలిపారు.

ధాన్యం సేకరణ టార్గెట్ పెంపు : జెసి ధాత్రిరెడ్డి

దెందులూరు : మండలంలోని కొవ్వలిలో ఆదివారం రైతులు ఆరబెట్టుకున్న ధాన్యాన్ని జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి ఆదివారం పరిశీలించి, రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రైతుల వద్ద ఉన్న ధాన్యాన్ని వెంటనే లిఫ్ట్ చేసేందుకు అవసరమైన లారీలను ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులు ఆదేశించారు. రైతు సేవాకేంద్రాల్లో ధాన్యం సేకరణ లక్ష్యాలను పెంచేందుకు ఆదేశాలు జారీ చేశామన్నారు. వర్షానికి తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. రైతులకు తగినన్ని టార్పలిన్స్ అందించాలని రైతు సేవా కేంద్రం సిబ్బందిని ఆదేశించారు. రైతుల విజ్ఞప్తి మేరకు జిల్లాలో ధాన్యం సేకరణ లక్ష్యాన్ని 2.50 లక్షల మెట్రిక్ టన్నులకు పెంచినట్లు తెలిపారు.

మా ధాన్యం కొనుగోలు చేయండి మహాప్రభో

మల్కాపురం రైతు సేవా కేంద్రం వద్ద రైతు సంఘం ఆధ్వర్యంలో రైతుల ధర్నా

ఏలూరు అర్బన్ : ధర్నా చేస్తున్న నేతలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

అకాల వర్షాలతో ఇబ్బందులు పడుతున్నాం, మా ధాన్యం వెంటనే కొనుగోలు చేయండి మహాప్రభో అంటూ ఏలూరు రూరల్ మండలం మల్కాపురం రైతు సేవా కేంద్రం వద్ద రైతు సంఘం ఆధ్వర్యంలో రైతులు, కౌలు రైతులు ఆదివారం ధర్నా నిర్వహించారు. ముందుగా రైతు సంఘం నాయకులు బరకాలు కప్పి ఉన్న ధాన్యం బస్తాలను, ధాన్యాన్ని పరిశీలించారు. అకాల వర్షంతో బరకాలపై పడి ఉన్న నీళ్లను తోడి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ ఒక్క మల్కాపురం రైతు సేవా కేంద్రం పరిధిలో 1500 మెట్రిక్ టన్నుల ధాన్యం వరకూ కల్లాల్లో ఉండిపోయిందన్నారు. కొనుగోలు లక్ష్యం పూర్తయిందని ధాన్యం కొనుగోళ్లు నిలిపివేయడంతో రైతులు, కౌలు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కల్లాల్లో ధాన్యాన్ని రక్షించుకునేందుకు నానా అవస్థలు పడుతున్నారని చెప్పారు. రైతు పండించిన ప్రతి గింజా కొనుగోలు చేస్తామంటూ హామీలిచ్చి మా టార్గెట్స్ పూర్తయ్యింది ధాన్యం కొనలేం అంటూ ప్రభుత్వం చేతులెత్తేయడం దారుణమని విమర్శించారు. ధాన్యం కొనుగోలు లక్ష్యం వెంటనే పెంచి రైతులు, కౌలు రైతులు వద్ద ఉన్న పూర్తి ధాన్యాన్ని కొనుగోలు చేసేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అకాల వర్షాలకు తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలన్నారు. ధాన్యం కొనుగోలు నిబంధనలు సడలించాలని కోరారు. అనంతరం రైతు సేవా కేంద్రం అసిస్టెంట్ తో ధాన్యం కొనుగోలు సమస్యలపై మాట్లాడగా మల్కాపురం రైతు సేవా కేంద్రం పరిధిలో 700 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు టార్గెట్ ఇచ్చినట్టు తెలిపారు. దీంతో అన్నదాతలు ఆందోళన విరమించారు. కార్యక్రమంలో ఆదాడ శ్రీనివాసరావు, లంకా వెంకటరమణ, గొర్రెల రొయ్యారావు, గుర్రాల శోభన్‌బాబు, కండిబోయిన రమేష్, యేసు, బి.శివకుమార్ పాల్గొన్నారు.

ఉంగుటూరు : మా ధాన్యం కొనుగోలు చేయండి అంటూ రైతు సంఘం ఆధ్వర్యంలో బొమ్మిడి సొసైటీ వద్ద ఆదివారం సాయంత్రం రైతులు, కౌలు రైతులు ధర్నా నిర్వహించారు. లారీల్లో లోడ్ చేసిన ధాన్యం గత మూడు రోజులుగా టార్గెట్స్ లేవనే పేరుతో మిల్లులకు తరలించకపోవడంతో అన్నదాతలు ఆగ్రహం వ్యక్తం చేస్తూ లారీల వద్ద బైఠాయించి నిరసన తెలిపారు. బొమ్మిడిలో నిలిచిపోయిన 10 లారీల ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించే ఏర్పాటు చేయాలని కోరారు. ధాన్యం కొనుగోలు సమస్యలు పరిష్కరించి అన్నదాతలను ఆదుకోవాలని లేనిపక్షంలో ఆందోళనలు తీవ్రతం చేస్తామని హెచ్చరించారు. కౌలు రైతుల సంఘం మండల నాయకులు దూడే కేశవ, వానపల్లి సత్యనారాయణ, ఊడిమూడి దానియేలు, ఎం.ధనుంజయరావు, లంక వెంకటేశ్వరరావు, నక్కా సత్యనారాయణ, ఎస్.శ్రీనివాసరావు, ఎం.శివప్రసాద్, ఎం.సోమేశ్వరరావు, ఎం.గణపతిరావు పాల్గొన్నారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

కలెక్టర్ కె.వెట్రిసెల్వి

ప్రజాశక్తి - ఏలూరు

వాతావరణ శాఖ ఏలూరు జిల్లాలో భారీ వర్షాలు, ఈదురు గాలుల హెచ్చరిక జారీ చేసిన నేపథ్యంలో జిల్లా యంత్రాంగాన్ని కలెక్టర్ కె.వెట్రిసెల్వి అప్రమత్తం చేశారు. భారీవర్షాలు ప్రారంభం కాగానే కలెక్టరేట్‌కు చేరుకుని కలెక్టరేట్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో వివిధ న్యూస్ ఛానెల్స్ ప్రసారమయ్యే జిల్లాలో భారీ వర్షం కారణంగా చెట్లు, విద్యుత్ స్తంభాలు కూలడం వంటి అంశాలను పరిశీలించిన వెంటనే తక్షణ చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సెల్ ఫోన్ ద్వారా ఆదేశాలు జారీ చేశారు. ఏలూరు నగరం, భీమడోలు మండలం గుండుగొలను, ద్వారకాతిరుమల, జంగారెడ్డిగూడెం, చింతలపూడి, నూజివీడు, తదితర ప్రాంతాలలో చెట్లు కూలి ట్రాఫిక్‌కు ఆటంకం ఉండని, విద్యుత్ స్తంభాలు కూలడంతో విద్యుత్ సరఫరాకు ఆటంకం కలిగిందని వచ్చిన అంశాలపై కలెక్టర్ వెంటనే స్పందించారు. సంబంధిత శాఖల అధికారులకు వెంటనే సెల్‌ఫోన్ ద్వారా ఫోన్ చేసి జెసిబి సహాయంతో చెట్లు తొలగించి ట్రాఫిక్‌కు ఎటువంటి ఆటంకం కలగకుండా చూడాలని, విద్యుత్ స్తంభాలు పునరుద్ధరించి విద్యుత్ సరఫరా జరిగేలా చూడాలని అధికారులను ఆదేశించారు.

అకాల వర్షాల పట్ల అప్రమత్తత అవసరం

దెందులూరు : అకాల వర్షాలతో అప్రమత్తంగా ఉండాలని రైతులకు, ప్రభుత్వ శాఖల అధికారులకు, సిబ్బందికి దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ సూచించారు. పెదవేగి మండలం దుగ్గిరాలలోని క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఉదయం పలు గ్రామాల నుంచి వచ్చిన ప్రజల నుంచి వినతుల స్వీకరించిన ఎంఎల్ఎ చింతమనేని సత్వరమే వాటిని పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ దెందులూరు నియోజకవర్గ పరిధిలోని రెవెన్యూ, విద్యుత్, పోలీసు, వైద్య ఆరోగ్య శాఖ, వ్యవసాయ శాఖ, నీటిపారుదల శాఖ, పంచాయతీరాజ్, ఆర్అండ్‌బి సహా సంబంధిత శాఖల అధికారులు, క్షేత్ర స్థాయి సిబ్బంది పూర్తి సమన్వయంతో పని చేసి నష్టనివారణ చర్యలు చేపట్టాలని తెలిపారు.

పూర్తిస్థాయిలో ధాన్యం కొనుగోలు

పోలసానిపల్లిలో జెసి పర్యటన

ప్రజాశక్తి - భీమడోలు

రైతుల విజ్ఞప్తి మేరకు ధాన్యం సేకరణ లక్ష్యాన్ని తాజాగా మరొక 45 వేల మెట్రిక్ టన్నులు పెంచినట్లు జెసి పి.ధాత్రిరెడ్డి తెలిపారు. దీంతో జిల్లాలో ధాన్యం సేకరణ లక్ష్యం 2.50 లక్షల మెట్రిక్ టన్నులకు చేరుతుందన్నారు. మండలంలోని పోలసానిపల్లి వద్ద అకాల వర్షాలకు, తడిసిన, ఇతర ఇబ్బందుల కారణంగా రోడ్లపై ఆరబెట్టిన ధాన్యాన్ని ఆదివారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు అమ్మకానికి సిద్ధం చేసిన ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు నిర్దేశిత లక్ష్యాల పునర్వ్యవస్థీకరణ, ధాన్యం కొనుగోలుకు అధికారులు సహకరించడం లేదని ఆమె దృష్టికి తెచ్చారు. ఈ నేపథ్యంలో ఆరబెట్టిన ధాన్యాన్ని జెసి ధాత్రిరెడ్డి, వ్యవసాయ శాఖ సంయుక్త సంచాలకులు హబీబ్ భాషా, పౌరసరఫరాల సంస్థ జిల్లా అధికారి పరిశీలించారు. రైతులను ఆదుకునేందుకు టార్పాలిన్‌లను రైతు సేవా కేంద్రాల వద్ద అందుబాటులో ఉంచామని తెలిపారు.

నేరాల నియంత్రణలో సీసీ కెమెరాల పాత్ర కీలకం

ఆగిరిపల్లి : నేర నిరోధనలో సీసీ కెమెరాల పాత్ర కీలకమని, ప్రతి ఒక దుకాణదారుడు తమ వ్యాపార స్థలం వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకుని నేరాలను అరికట్టడంలో సహకరించాలని నూజివీడు డిఎస్‌పి కెవివిఎన్.ప్రసాద్ కోరారు. ఆగిరిపల్లిలోని వర్తక సంఘ సభ్యులకు ఆదివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దుకాణాల ముందు బైకులు అస్తవ్యస్తంగా పెట్టకుండా షాపు యజమానులు సహకరించి, ట్రాఫిక్ నియంత్రణకు తోడ్పడాలని సూచించారు. సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండటంతో పాటు సైబర్ బాధితులు వెంటనే 1930 నెంబర్‌కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ కె.శుభశేఖర్, ఎఎస్ఐ తఫ్లీక్‌నాయక్, పోలీసు సిబ్బంది, వర్తకసంఘ సభ్యులు పాల్గొన్నారు.

పాడి రైతుల అభ్యున్నతికి కృషి

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

పాడి రైతులకు నూరు శాతం న్యాయం చేసేందుకు కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తుందని ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి తెలిపారు. గతంలో ఎన్నడూలేని విధంగా 50 శాతం రాయితీపై దాణా పంపిణీ చేస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందని ఆయన స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వం రైతుల సంక్షేమానికి పెద్దపీట వేస్తుందన్నారు. పాడిరైతులకు 50 శాతం రాయితీపై సమీకృత దాణా పంపిణీ చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఏలూరు 46వ డివిజన్‌లోని పశు వైద్యశాలలో ఆదివారం నిర్వహించిన సబ్సిడీ దాణా పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. పాడిరైతులకు కూటమి అండగా ఉంటుందని ఆయన భరోసా ఇచ్చారు. ఎన్నడూలేని విధంగా 50 శాతం రాయితీపై దాణాను అందించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు.

వర్జీనియా పొగాకుకు గిట్టుబాటు ధర కల్పించాలి

నేడు మాజీ ఎంఎల్ఎ తెల్లం బాలరాజు ఆందోళన

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

వర్జీనియా పొగాకు రైతులకు మద్దతుగా మాజీ ఎంఎల్ఎ తెల్లం బాలరాజు సోమవారం ఆందోళన కార్యక్రమం నిర్వహించనున్నట్లు మండల కన్వీనర్ తుమ్మలపల్లి గంగరాజు తెలిపారు. వర్జీనియా పొగాకు ధర పతనం కావడంతో గిట్టుబాటు ధర లభించక రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో వారికి మద్దతుగా బాలరాజు ఆందోళన కార్యక్రమం చేస్తున్నట్లు తెలిపారు. వర్జీనియా పొగాకు వేలం కేంద్రం వద్ద ఉదయం తొమ్మిది గంటలకు ఆయన పాల్గొంటారన్నారు. వైసిపి శ్రేణులతో సహా ప్రజాప్రతినిధులు, రైతులు వేలం కేంద్రానికి హాజరు కావాల్సిందిగా సూచించారు. మానవత్వం చాటుకున్న మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రమాద బాధితులను ఆదుకొని నిలిచిన నాయకుడు

మానవత్వం చాటిన మంత్రి మనోహర్

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

విజయవాడ నుంచి కాకినాడ వెళ్తున్న రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ భీమడోలు సమీపంలోని ఎం.నాగులపల్లి అడ్డరోడ్డు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదాన్ని చూసి మానవత్వం చాటుకున్నారు. జాతీయ రహదారిపై ద్విచక్ర వాహనాన్ని ఇన్నోవా కారు ఢీకొనడంతో బైక్‌పై ప్రయాణిస్తున్న పెదవేగి మండలం చక్రాయగూడెం గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు తీవ్ర గాయాలపాలయ్యారు. అటుగా వెళ్తున్న మంత్రి నాదెండ్ల మనోహర్ తన వాహనం ఆపి గాయపడిన వ్యక్తులకు సహాయం అందించారు. అంబులెన్స్‌కు కాల్ చేసి ఆసుపత్రికి తరలించే ఏర్పాట్లు చేశారు. తన కాన్వాయ్‌లోని ప్రోటోకాల్ వాహనాన్ని ఎస్కార్ట్ వాహనంగా ఉపయోగించి వేగంగా ఆసుపత్రికి చేరేలా చేశారు. ఎస్‌పికి ఫోన్ చేసి గాయపడిన వ్యక్తులకు అత్యుత్తమ వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. హైవే పెట్రోలింగ్ సిబ్బంది సకాలంలో స్పందించి క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు.

అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయాలి

నూజివీడు టౌన్ : గత 11 ఏళ్లుగా అగ్రిగోల్డ్ యాజమాన్యం మోసానికి వ్యతిరేకంగా పోరాడుతున్న ప్రజలకు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే న్యాయం చేయాలని సిపిఐ రాష్ట్ర సమితి నాయకులు వలసాని వెంకట రామారావు డిమాండ్ చేశారు. నూజివీడులోని అమర్ భవనంలో ఆదివారం నిర్వహించిన అగ్రిగోల్డ్ ఏజెంట్స్, కస్టమర్స్ అసోసియేషన్ ముఖ్యుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ప్రకటించిన విధంగా అగ్రిగోల్డ్ ఆస్తులను వేలం వేసి బాధితులకు న్యాయం చేయాలని, మిగిలిన కమిటీ త్వరగా చర్యలు చేపట్టి అగ్రిగోల్డ్ బాధితులకు వెంటనే న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అగ్రిగోల్డ్ బాధితులకు సిపిఐ పార్టీ ఎల్లప్పుడూ అండగా నిలుస్తుందని తెలిపారు. సిపిఐ నాయకులు నిమ్మగడ్డ నరసింహ, తదితరులు పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

రైలు నుంచి జారిపడి యువకుడికి గాయాలు

ప్రజాశక్తి - ఉంగుటూరు

విజయవాడ- విశాఖ రైలు మార్గం నాచుగుంట- వెల్లమిల్లి మధ్య ఆదివారం కదులుతున్న రైలు నుంచి యువకుడు జారి పడిపోయాడు. కీమ్యాన్ చూసి రైల్వే అధికారులకు సమాచారం అందించడంతో తాడేపల్లిగూడెం 108 అంబులెన్సులో తాడేపల్లిగూడెం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనకాపల్లికి చెందిన కె.గణేష్ తిరుపతి వెళ్లి తిరిగి వస్తూ రైలులో గుమ్మం వద్ద కూర్చుని పడిపోయారు. రైల్వే ట్రాక్ నుంచి సుమారు కిలోమీటరు దూరం మోసుకుని తీసుకొచ్చి అంబులెన్సులో ఎక్కించామని 108 టెక్నీషియన్ అనిల్‌కుమార్ చెప్పారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజా పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈ క్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

గాలి, వాన బీభత్సం

నేలకొరిగిన చెట్లు, విద్యుత్‌స్తంభాలు
రైతులకు నష్టం
చిరువ్యాపారుల అవస్థలు
లోతట్టు ప్రాంతాలు జలమయం

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

నగరంలో వీచిన ఈదురు గాలులకు పురాతనమైన చెట్లు నేలకొరిగాయి. వన్ టౌన్, టూ టౌన్, త్రీ టౌన్ పరిధిలో చెట్లు నేలకొరిగాయి. రెవెన్యూ, పోలీసు అధికారులు యుద్ధ ప్రాతిపదికన వీటిని తొలగించారు. ఏలూరు మినీ బైపాస్‌లో పురాతనమైన భారీ వృక్షం నేలకొరగడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. సమాచారం అందుకున్న కలెక్టర్ వెంటనే నగరంలో నేలకొరిగిన చెట్లను తొలగించాలని రెవెన్యూ అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. రెవెన్యూ అధికారులు, పోలీసులు సంయుక్తంగా చెట్లను తొలగించారు.

జీలుగుమిల్లి : మండలవ్యాప్తంగా ఆదివారం ఉదయం నుంచి వాతావరణం ఒక్కసారిగా మేఘావృతమై ఉరుములతో కూడిన వర్షం కురిసింది. నిన్నటి వరకు ఎండ తీవ్రత అధికంగా ఉండటంతో పాటు ఒక్కసారిగా వాతావరణం చల్లబడి వర్షం కురవడంతో కాస్త ఉపశమనం కలిగింది. వర్షానికి పలు చోట్ల చేతికి వచ్చిన వేరుశనగ, పొగాకు, మొక్కజొన్న తోటలు తడిసిపోయాయి. భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో రైతులు ఆందోళన చెందుతున్నారు.

కలిదిండి : ఉరుములు, మెరుపులతో పాటు ఈదురు గాలులతో కూడిన వర్షం వల్ల జనజీవనం అస్తవ్యస్తమైంది. సుమారు రెండు గంటల పాటు కురిసిన వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. సానారుద్రవరం, కోరుకొల్లు మధ్య చెట్టు కొమ్మలు విరిగి పడడంతో కొద్దిసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ఉదయం నుంచి అడపాదడపా కరెంట్ కోతలు తప్పలేదు. తేలికపాటి రేకులు, ఫ్లెక్సీలు ఎగిరిపడ్డాయి. కోట కలిదిండి రోడ్డు, పోలీస్ స్టేషన్ సమీపంలోని రోడ్డుపై నీరు నిలిచిపోవడంతో పాదచారులు, వాహనదారులు పలు ఇక్కట్లకు గురయ్యారు. కొన్నిరోజులుగా ఎండ తీవ్రతకు ఉక్కిరిబిక్కిరి అవుతున్న ప్రజలకు ఈ వర్షంతో వాతావరణం చల్లబడి కొంత ఉపశమనాన్ని కలిగించింది. మరో వైపు ఒక్క సరిగా వాతావరణం చల్లబడడంతో ఆక్వా రైతులు ఆందోళనకు గురయ్యారు. ప్రధానంగా రొయ్యలను కాపాడుకునేందుకు ఏరియేటర్స్‌పై ఆధారపడ్డారు.

ముసునూరు : మండలంలో కురిసిన అకాల వర్షానికి పలు రకాల పంటలు నేలపాలయ్యాయి. మండలంలోని పలు గ్రామాల్లో పండించిన రబీ ముసునూరు, చెక్కపల్లి, చింతలవల్లి, వలసపల్లి, లోపూడి, గుల్లపూడి, గుడిపాడు, తాళ్లవల్లి గ్రామాల్లోని మామిడి పంట నేలరాలింది. తడిసిన వరి పంట ఆరబెట్టుకుని కల్లాళ్లో ఉన్న వరి పంట తడిసి ముద్దవడంతో ఏం చేయాలో తెలియని దిక్కుతోచని స్థితిలో రైతులు ఉన్నారు.

కొయ్యలగూడెం: కొయ్యలగూడెం మండలంలో ఈదురుగాలులతో కూడిన ఉరుములు, వర్షం కురిసింది. పలు ప్రాంతాల్లో మొక్కజొన్న, మామిడి, మిరప వంటి పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఈ పంట నష్టంతో స్థానిక రైతులు భారీ నష్టాలను చవిచూశారు. పంటలు దెబ్బతినడంతో రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు నష్ట నివారణ చర్యలపై దృష్టి సారించాలని రైతులు కోరుతున్నారు.

ముదినేపల్లి : మండల కేంద్రమైనలో ముదినేపల్లిలో భీకర గాలి వాన కురిసింది. ఉదయం తొమ్మిది గంటల ప్రాంతంలో ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం పడింది. సుమారు గంటపాటు వర్షం కురవడంతో ప్రజలు ఇళ్లకే పరిమి తమయ్యారు. అకస్మాత్తుగా ఆకాశం చల్లబడి, చల్లని వాతావరణంలో జోరుగా వర్షం కురిసింది. అకస్మాత్తుగా కురిసిన అకాల వర్షంతో ప్రజలు, చిరు వ్యాపారులు పలు ఇక్కట్లు పడ్డారు.

ద్వారకాతిరుమల : నేలరాలిన మామిడి

గత నెల రోజులుగా ఎండలతో ఇబ్బంది పడిన జనం అకాల వర్షంతో వాతావరణం చల్లబడటంతో ఊపిరి పీల్చుకున్నారు. వర్షం కురిసి వాతావరణ చల్లబడడంతో పిల్లలు, యువకులు చల్లదనానికి కేరింతలు కొడుతున్నారు.

ఏలూరులో రోడ్డుపై పడిన వృక్షం

గాలివానకు నేలరాలిన మామిడి కాయలు

ద్వారకాతిరుమల : మండలంలోని చుట్టుపక్కల గ్రామాల్లో ఆదివారం ఉదయం ఆకాశం మబ్బులతో మేఘావృతమై తీవ్రమైన ఈదురు గాలితో వర్షం కురిసింది. గాలివాన బీభత్సానికి కొమ్మర, కోడిగూడెం, రాళ్లకుంట గ్రామాల్లో మామిడి తోటల్లో మామిడ కాయలు నేలరాలయి. అధికారులు పంట నష్టంపై వివరాలు సేకరించే పనిలో పడ్డారు. కాయలు కోసే సమయంలో తీవ్రంగా నష్టపోయామని ఆవేదన వ్యక్తం చేశారు.

భీమడోలు : మండలంలో కురిసిన అకాల వర్షాలు, ఈదురు గాలుల కారణంగా ట్రాన్స్ కో రూ.పది లక్షల వరకు ప్రాథమిక అంచనాల మేరకు నష్టం వాటిల్లిందని అధికారులు తెలిపారు. వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఆదివారం రాత్రి సమయానికి గృహ సర్వీసులోకి విద్యుత్ పునరుద్ధరణ కార్యక్రమాలు భీమడోలులో తుది దశకు చేరుకున్నాయి. వ్యవసాయ విద్యుత్తు సరఫరా కోసం పునరుద్ధరణ పనులు సోమవారం ప్రారంభమయ్యే అవకాశాలు ఉన్నాయి. ప్రాథమిక అంచనాల మేరకు పొలసానిపల్లిలో ఆరు విద్యుత్ స్తంభాలు, అంబరుపేట పంచాయతీ పరిధిలో రెండు విద్యుత్ స్తంభాలు ధ్వంసమయ్యాయి. వీటికి గల కండక్టర్లు కూడా పాడయ్యాయి. ఈ నేపథ్యంలో పొలసానిపల్లి గ్రామ సర్పంచి షేక్ రహీమా బేగం హసేన విద్యుత్ స్తంభాలకు, కండక్టర్లకు అడ్డంగా ఉన్న చెట్ల కొమ్మలు తొలగించే కార్యక్రమాన్ని చేపట్టారు.

రేకులషెడ్డుపై భారీవృక్షం పడి బాలుడు మృతి

రేకులషెడ్డుపై పడిన భారీ వృక్షం

ముసునూరు : అకాల వర్షం కారణంగా బలంగా ఈదురు గాలులు వీచడంతో రేకుల షెడ్డుపై భారీ వృక్షం పడి బాలుడు మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని మండలంలోని చెక్కపల్లిలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన మామిళ్ల మారేశ్వరరావు బిసి ఏరియాలోని దెబ్బగూడెం వీధిలో చెరువు కట్టపై రేకుల షెడ్డులో భార్య, తన ముగ్గురు పిల్లలలో కలిసి జీవిస్తున్నాడు. ఈ క్రమంలో ఆదివారం ఉదయం ఆకాల వర్షంతో పాటు బలమైన ఈదురు గాలులు వీచడంతో ఇంటి పక్కన ఉన్న (ఎలాగ చెట్టు) భారీ వృక్షం ఆ రేకుల షెడ్డుపై పడింది. ఈ ప్రమాదంలో గదిలో ఉన్న మారేశ్వరరావు కుమారుడు బాలగోవింద్ (12) అక్కడికక్కడే మృతి చెందాడు. మారేశ్వరరావు, అతని భార్య, ఇద్దరు కుమార్తెలు వరండాలో ఉండడంతో వారు క్షేమంగా బయటపడ్డారు. బాలగోవింద్ మృతితో కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. సమచాచారం తెలుసుకున్న ఎస్ఐ ఎం.చిరంజీవి తమ సిబ్బందితో వెళ్లి వివరాలు సేకరించారు. నూజివీడు మాజీ ఎంఎల్ఎ మేకా వెంకట ప్రతాప్ అప్పారావు కుటుంబ సభ్యులను ఓదార్చి కొంతమేర ఆర్థిక సహాయం అందించారు.

బాల గోవింద్ కుటుంబానికి అండగా నిలుస్తాం

మంత్రి కొలుసు పార్థసారథి

బాలగోవింద్ కుటుంబాన్ని అన్ని విధాలుగా ప్రభుత్వం ఆదుకుంటుందని మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. ఆయన బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ప్రభుత్వ పెద్దలతో మాట్లాడి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. బాధిత కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. తక్షణ సహాయంగా నిత్యావసర సరుకులు అందించాలని అధికారులను ఆదేశించారు. పక్కా ఇళ్లు నిర్మించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. బాధిత కుటుంబానికి మంత్రి రూ.25 వేలు అందించారు.

సర్వీస్ వైర్ తగిలి వ్యక్తి మృతి

దెందులూరు : అకాల వర్షం గాలి వల్ల విద్యుదాఘాతంతో ఒక వ్యక్తి మృతి చెందాడు. దెందులూరు గ్రామంలోని పెద్ద దళితవాడకు చెందిన తానికొండ జార్జి తాపీ పని చేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఆదివారం వర్షం గాలికి ఇంటిముందు సర్వీస్ వైర్ తెగిపడడంతో గుర్తించని జార్జి ఇంటి బయటకు రావడంతో ఆ వైర్ తగిలి విద్యుదాఘాతానికి గురయ్యాడు. భార్య స్థానికులతో కలిసి దెందులూరు ప్రభుత్వాసుపత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు.

బాలికకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

కొయ్యలగూడేనికి చెందిన కంచర్ల జ్యోత్స్నకు వైద్య చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు చెందిన ఉడుత స్వచ్ఛంద సంస్థ రూ.30 వేలు ఆర్థిక సాయం అందించిందని పాప తండ్రి కంచర్ల రాజేష్ ఆదివారం తెలిపారు. అరుదైన వ్యాధితో గత కొంతకాలం నుంచి తమ కుమార్తె బాధపడుతుందన్నారు. విషయం తెలుసుకున్న దాతలు స్పందిస్తూ ఆర్థిక సహాయం చేస్తున్నారన్నారు. వైద్య ఖర్చులకు సుమారు రూ.12 లక్షలు అవుతాయని వైద్యులు తెలపడంతో దాతలపై ఆధారపడి ఉన్నామని రాజేష్ వాపోయాడు.

వెంకటరాజర్షికి ఘన సత్కారం

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

కళాకారునిగా ప్రస్థానం సాగించి విఖ్యాతి గాంచిన అవార్డులు సాధించి ఏజెన్సీ మెట్ట ప్రాంతానికి పేరు తీసుకురావడంలో మహాశివబట్టు వెంకట రాజర్షి విశేష కృషి చేశారని చిలకమర్తి ఆర్ట్ అసోసియేషన్ పేర్కొంది. కొయ్యలగూడెంలోని రాజర్షి నివాసంలో ఆయనను సభ్యులు సత్కరించి అభినందించారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన జాతీయ కళారంగ దినోత్సవం సందర్భంగా రాజర్షి రాష్ట్రస్థాయిలో కందుకూరి పురస్కారం అందుకున్నారని, ఇది మనందరికీ గర్వకారణమని చిలకమర్తి సభ్యులు తెలిపారు. ప్రభుత్వ ఉపాధ్యాయునిగా విధులు నిర్వహిస్తూనే దాదాపు 200 పైగా ప్రాంతీయ, జాతీయ స్థాయిలో పురస్కారాలు అందుకోవటం రాజర్షి కళాతృష్ణకు నిదర్శనంగా నిలిచిందన్నారు. నిడదవోలు రామారావు, అనిపెద్ది రాధాకృష్ణ పాల్గొన్నారు.

బస్ షెల్టర్ ప్రారంభం

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలోని పెయ్యేరు పంచాయతీ శివారు వైఎస్ఆర్ కాలనీ వద్ద ప్రయాణికుల సౌకర్యార్థం నిర్మించిన బస్సు షెల్టర్‌ను ఆదివారం సాయంత్రం ముదినేపల్లి ఎస్ఐ వి.ఎస్.వీరభద్రరావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో దాకారం సర్పంచి జాస్తి రాజా, రుద్రపాక సర్పంచి జంగం రాజు, పెయ్యేరు మాజీ సర్పంచి దుక్కుపాటి శేషుబాబు, బందేల విజయ్‌కుమార్, భూపతి రవీంద్ర, పంతగాని సురేష్, మొవ్వ ఫణీంద్ర, డొక్కు మాల సందీప్ కుమార్, పరిసే నాగరాజు, మాగంటి రాజేష్, టేకు కనకచార్యులు, దాసరి కృపారావు, మొవ్వ మధు, దాసరి ప్రకాష్ పాల్గొన్నారు.

ఆర్యవైశ్య కళ్యాణ మండప రజతోత్సవాలు

ద్వారకాతిరుమల : శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆర్యవైశ్య కళ్యాణ మండపం ట్రస్ట్ 25 ఏళ్లు దిగ్విజయంగా పూర్తి చేసుకున్న సందర్భంగా ఆర్యవైశ్య కళ్యాణ మండపం వద్ద రజతోత్సవ సభ ఘనంగా నిర్వహించారు. ఈ సభకు ముఖ్య అతిథులుగా జగ్గయ్యపేట ఎంఎల్ఎ శ్రీశ్రీరాం తాతయ్య, రాష్ట్ర వైశ్య కార్పొరేషన్ ఛైర్మన్ శ్రీ డూండి రాకేష్ హాజరయ్యారు. ట్రస్టు ఛైర్మన్ బొండాడ (రాంపండు) మాట్లాడుతూ 1999లో 12 మంది సభ్యులతో ప్రారంభమైన ఆర్యవైశ్య సంఘం ట్రస్ట్ ఆర్యవైశ్యుల సహకారంతో అభివృద్ధి చెందిందన్నారు. ఈ కళ్యాణ మండపంలో రెండు నాన్ ఎసి, రెండు ఎసి కళ్యాణ మండపాలు, అన్నదాన భవనం, వాసవి మాత ఆలయం ఉన్నాయని తెలిపారు. ఆర్యవైశ్యులకు, చినవెంకన్న దర్శనానికి వచ్చే యాత్రికులకు సేవ చేయడంలో ఆర్యవైశ్య సంఘం ఎప్పుడూ ముందుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి ఇమ్మడి శ్రీనివాసరావు ప్రధాన కార్యదర్శి మానేపల్లి సత్యనారాయణ, ఆర్యవైశ్య సంఘం మండలాధ్యక్షులు ఇమ్మడి రత్నాజీ, నార్ల కాశీనాథ్, వంటిపల్లి బాల భాస్కరరావు, నల్లమిల్లి జగన్నాధరావు, గుడిమెట్ల గంగాధర్ పాల్గొన్నారు.

భారీ వర్షానికి తడిసిన ధాన్యం రాశులు

జెసి ఎదుట రైతుల ఆవేదన

ప్రజాశక్తి - ఉంగుటూరు

అకస్మాత్తు భారీ వర్షానికి రాశుల మీద ఉన్న ధాన్యం, బస్తాలు తడిచిపోయాయని రైతు లు ఆందోళన చెందారు. గోపీనాథపట్నం రైతు సేవా కేంద్రం పరిధిలో ధాన్యం రాశులను జెసి ధాత్రిరెడ్డి ఆదివారం పరిశీలించారు. ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో టార్గెట్ మించిపోయిందని చెప్పి ధాన్యం కొనడం లేదని, వర్షాలకు ఎక్కడ దాచుకోవాలని తిమ్మయ్యపాలెం, గోపీనాథపట్నం, కొత్తగూడెం రైతులు తమ ఆవేదనను జెసి ఎదుట వెళ్లకక్కారు. పంజాబ్ రకాన్ని ఎందుకు పండించారని అధికారులు రైతులను ప్రశ్నించారు. దీనిపై రైతులు మాట్లాడుతూ పంటలు పండించినప్పుడు ఇకవైపైసిలు చేసినప్పుడే ఈ టార్గెట్‌ల విషయం చెప్పి ఉంటే ప్రత్యామ్నాయ పంటల వైపు దృష్టి సారించేవాళ్లమన్నారు. మండలంలో 25 ఆర్ఎస్‌కేలో టార్గెట్ ఎంత... ఎంత సేకరించారో వివరాలు తీయండని రైతులు ప్రశ్నించారు. ఇప్పటికైనా ధాన్యం సేకరణ టార్గెట్ పెంచి రైతుల వద్ద ఉండిపోయిన ధాన్యాన్ని కొనుగోలు చేసేలా అధికారులు చర్యలు తీసుకో వాలని రైతులు కోరారు. దీనిపై జెసి స్పందిస్తూ టార్గెట్ పెంచేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశాలు ఇచ్చారని తహశీల్దారు రవికుమార్ వెల్లడించారు. జెడిఎ హబీబ్‌భాషా, డిసిఒ శ్రీనివాస్, భీమడోలు ఎడిఎ, తహశీల్దార్ పాలపర్తి రవికుమార్, ఉంగుటూరు ఎఒ, విఆర్ఒ పాల్గొన్నారు.

ధాన్యం రాశుల్లో నీటిని తోడుతున్న రైతులు

కొనుగోలు ఆపేయడం వల్ల రైతులకు నష్టం

ఆరుగాలం పండించిన ధాన్యం సేకరణ లేకపోవడంతో మండు వేసవిలో ఈదురు గాలులతో కూడిన అకాల భారీ వర్షానికి పంట తడిచిపోయిందని రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారు. మండలంలో గోపీనాథపట్నం, తిమ్మయ్యపాలెం, దొంతవరం, కాగుపాడు, పొట్టిపాడు, తోటరామ చంద్రపురం, ఉంగుటూరు తదితర గ్రామాల్లో ధాన్యం రాశుల చుట్టూ వర్షపు నీరు చేరడంతో నీటిని తోడేందుకు రైతులు పడరాని పాట్లు పడుతున్నారు. తిమ్మయ్యపాలెంలో సింహాద్రి సత్యనారాయణకు చెందిన ధాన్యం బస్తాలు నీటి అడుగున ఉండటంతో తడిచాయి. దొంతవరంలో రాశులు నీటి చెమ్మకు నానిపోతున్నాయని రైతు కంభంపాటి మణి ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. టార్గెట్ పూర్తయిందనే సాకుతూ సంచులు ఇవ్వకపోవడం తో ధాన్యం రాశుల పై బరకాలు కప్పుకోవాల్సి వస్తోందని వాపోతున్నారు.

జెసికి సమస్యలు వివరిస్తున్న రైతులు

రైతు సంక్షేమాన్ని విస్మరించిన కూటమి ప్రభుత్వం

వై.పాపారావు బాజ్జి, రైతు,

జిల్లా వ్యవసాయ మండల మాజీ సభ్యుడు

అమరావతి పున:నిర్మాణ సందర్భంగా మోడీ భజనలో మునిగిన కూటమి ప్రభుత్వం రైతుల నుంచి ధాన్యం సేకరణకు టార్గెట్లు పెంచడంలో విఫలమైంది. వాస్తవానికి దాళ్వా మాసూళ్లు మొదలైనప్పటి నుంచి వాతావరణం అనుకూలంగానే ఉంది. కాని ప్రభుత్వం అసంబద్ధ, అనాలోచిన చర్యల వల్ల రైతుల పంట వర్షార్పణమైంది. పది రోజుల నుంచి సంచుల కోసం రైతులు ఎదురుచూస్తున్నారు. ఉంగుటూరు మండలంలో 35 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం ఇంకా ఉంది. ఆదివారం వర్షానికి 20 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం తడిసింది. తక్షణమే ప్రతి గింజను ప్రభుత్వమే కొనుగోలు చేయాలి. లేకపోతే హైపై ఆందోళన, ధర్నాలతో దిగ్బంధం చేస్తాం.

ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించాలి

వ్యకాస జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఉపాధి హామీ కూలీల సమస్యలు పరిష్కరించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ డిమాండ్ చేశారు. స్థానిక అన్నే వెంకటేశ్వరరావు భవనంలో మే 20వ తేదీ దేశవ్యాప్త సమ్మెలో భాగంగా ఉపాధి పనులు బంద్ చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ ముద్రించిన కరపత్రం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ మాట్లాడుతూ ఉపాధి కూలీలు పనిచేస్తున్న ప్రదేశాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసే విధంగా వ్యవహరిస్తున్నాయన్నారు.

సమస్యలు పరిష్కారం కోసం మరో పక్క ఉపాధి హామీ చట్టానికి కేంద్రంలో నిధులు పెంచాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మే 20న దేశవ్యాప్తంగా ఉపాధి పనులు బంద్ చేయనున్నట్లు తెలిపారు. ఉపాధి హామీలో జరుగుతున్న అవినీతి, అక్రమాలపై సమగ్ర దర్యాప్తు జరపాలని కోరారు. మే 20న జరుగుతున్న ఉపాధి పనుల బందులో ఉపాధి కూలీలు, మేట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, వ్యవసాయ కార్మికులు, పేదలందరూ కలిసి రావాలని, ప్రజలందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.జీవరత్నం, జిల్లా ఉపాధ్యక్షులు ఎ.రవి, తామా ముత్యాలమ్మ, జి.వెంకట్రావు, సహాయ కార్యదర్శి కారం నాగదుర్గ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ప్రజాశక్తి - టి.నర్సాపురం

మండలంలోని బొర్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థులు అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. 2001-2002 సంవత్సరం నాటి పూర్వ విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. ఈ సందర్భంగా అలనాటి జ్ఞాపకాలను ఒకరికి ఒకరు నెమరు వేసుకున్నారు. నాటి ఉపాధ్యాయులకు చిరు సత్కారం నిర్వహించారు. చదువుకునే రోజుల జ్ఞాపకాలను రానున్న రోజుల్లో అందరం కలిసికట్టుగా పదిలం చేసుకోవడం కోసం కృషి చేద్దామన్నారు. పాత జ్ఞాపకాలను మననం చేసుకుంటూ ఉల్లాసంగా ఉత్సాహంగా ఉదయం నుంచి సాయంత్రం వరకు నాటి తరగతి గదుల సంభాషణలను, నేడు ఉన్న పరిస్థితులను ఒకరికి ఒకరు పరిచయం చేసుకున్నారు. అందరూ కలిసి గ్రూప్ ఫొటో తీయించుకుని అలరించారు

అంజుమన్ ఆధ్వర్యాన పలు సేవా కార్యక్రమాలు

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఉత్సాహభరిత వాతావరణంలో అంజుమన్ నూతన కమిటీ సభ్యులు అనేక సేవాకార్యక్రమాలకు శ్రీకారం చుట్టడం ఎంతో అభినందనీయమని ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి ప్రశంసించారు. ఆదివారం ఏలూరు వన్‌టౌన్‌లోని అంజుమన్ హాల్‌లో అంజుమన్ ఇ ముహాఫిజుల్ ఇస్లాం ఆధ్వర్యంలో ఉచిత ఖత్నా, మెడికల్ క్యాంపు కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ఎంఎల్ఎ బడేటి చంటి పాల్గొని పిల్లలకు పాలు, బ్రెడ్లు, మెడిసిన్ పంపిణీ చేశారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ బడేటి చంటి మాట్లాడుతూ అంజుమన్ కమిటీ ఆధ్వర్యంలో భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అంజుమన్ ప్రెసిడెంట్ ఎండి జబివుల్లా, అంజుమన్ వ్యవహారాల అధ్యక్షులు రాజా అహ్మద్, ముఖ్య సలహాదారులు, కార్పొరేటర్ ఇలియాస్ పాషా, సెక్రటరీ అహ్మదులా షరీఫ్, కోశాధికారి షేక్ సిరాజ్ భాషా, జాకీర్ హుస్సేన్, ఇక్బాల్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగిన వేసవి శిక్షణ తరగతులు

భీమడోలు : భీమడోలు శాఖా గ్రంథాలయంలో గ్రంథ పాలకులు కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిక్షణా తరగతులు ఆదివారంతో ఐదో రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ప్రపంచ నవ్వుల దినోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆరోగ్య పరిరక్షణకు నవ్వు సహకరిస్తుందని గ్రంథ పాలకులు పేర్కొన్నారు. ఇదే క్రమంలో సైన్స్, జనరల్ నాలెడ్జ్, లెక్కలు సబ్జెక్టులపై గ్రంథ పాలకులు విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. సామాజిక కార్యకర్త, ఉపాధ్యాయులు మండే సుధాకర్ నీతి కథల గురించి వివరించారు. పుస్తక సమీక్షను విద్యార్థులతో చేయించారు. నిజ జీవితంలో నీతి కథలు ప్రాముఖ్యతను వివరించారు.

ఘనంగా భగీరథ మహర్షి జయంతి వేడుకలు

ప్రజాశక్తి - దెందులూరు

ఏలూరు మండలం మాదేపల్లి సగర్లపేటలో మాదేపల్లి మాజీ సర్పంచి తాడిశెట్టి వెంకటరమణ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో భగీరథ మహర్షి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తాడిశెట్టి వెంకటరమణ లక్ష్య సాధనకు మహర్షి భగీరథుడిని స్ఫూర్తిగా తీసుకోవాలని చెప్పారు. ఈ సందర్భంగా తాడిశెట్టి వెంకటరమణ కుటుంబ సభ్యులు తేనేటి విందు ఏర్పాటు చేశారు.

ఏలూరు సిటీ : భగీరథ జయంతిని ఏలూరులో ఫిరంగుల దిబ్బ వద్ద ఫ్లాష్ వారి ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా ఎంఎల్ఎ బడేటి చంటి, ఎఎంసి ఛైర్మన్ మామిళ్లపల్లి పార్థసారథి హాజరయ్యారు. ఫిరంగుల దిబ్బ వద్ద ఉన్న చెరువులో ఉన్న భగీరథ విగ్రహానికి పూలమాలలు వేశారు. అనంతరం బడేటి చంటి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

భగీరథ విగ్రహావిష్కరణ

ముసునూరు : మండలంలోని చెక్కపల్లి గ్రామం లో బిసి ఏరియా సగరుల కాలనీలో భగీరథ విగ్రహాన్ని స్థానికులు సహాయ సహకారాలతో నిర్మించి ఆదివారం ప్రారం భోత్సవం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నూజివీడు మాజీ ఎంఎల్ఎ మేకా వెంకట ప్రతాప్ అప్పారావు, వైస్ ఎంపిపి కోటగిరి రాజా నాయన, జెడ్‌పిటిసి సభ్యులు ప్రతాప్, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మహారాజశ్రీ కాకినాడ 4వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు
O.S. No. 882/2024
Between:
సాగి వెంకట సత్యనారాయణ వర్మ -వాది
మరియు
గుండుగొంటి శ్యామలరావు -ప్రతివాది
To:
గుండుగొంటి శ్యామలరావు, తండ్రి: రామస్వామి, ఇంటి నెం. 11-115/2, హరిజనపేట, చింతలపూడి - 534460, ఏలూరు జిల్లా.
పై నెంబరు దావాలో ప్రతివాది అయిన మీకు శ్రీ కోర్టు వారు ఎన్నిసార్లు దావా సమన్లు పంపినను తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. కావున శ్రీ కోర్టు వారు మీ హాజరు నిమిత్తం **ది. 17-06-2025 సం॥రం తేదీకి వాయిదా వేసినారు. మీరు ఆరోజు ఉదయం గం॥ 10.30 ని॥లకు** స్వయంగా గాని, మీ వకీలు ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరయ్యి మీ యొక్క ఆక్షేపణలు తెలియపర్చుకోవలెను. లేని యెడల పై దావా మీ పరోక్షమున తీర్మానించబడును.
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
చిత్తలూరి వెంకట సుబ్బారావు
కాకినాడ న్యాయవాది, కాకినాడ-533005
30-4-2025 సెల్: 9948519236

ప్రకటన
మహారాజశ్రీ భీమవరం ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) భీమవరం వారి కోర్టులో
O.S.No. 386/2024
Between:
వాది: - మెంటే వెంకట స్వామి
Vs
ప్రతివాది: - సరాబు లోక రక్షకుడు లనే లోక సాక్షుడు
ప్రతివాది:
సరాబు లోక రక్షకుడు అనే లోక సాక్షుడు, S/o. సుబ్బారావు, Water Tank Opposite, పెద అమిరం, కాళ్ళ మండలం, ప॥గో॥జిల్లా.
పై నెంబరు దావాలో అనేక పర్యాయములు ప్రతివాదికి శ్రీ కోర్టు వారి ద్వారా సమన్లు పంపించినప్పటికీ అందుకొనక కాలయాపన చేయుచున్నందున శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారము పై ప్రతివాది **ది. 18-06-2025వ సం॥ తేదిన ఉదయం గం. 10-30 ని॥లకు** మీరు స్వయంగా గాని, మీ ప్లీడరు గారి ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరై తమ ఆక్షేపణలు తెలియపర్చుకొనవలెను. అట్లు కాని ఎడల శ్రీ కోర్టు వారు మీ పరోక్షమందు తీర్మానించబడునని ఈ ప్రకటన ద్వారా తెలియపర్చడమైనది.
(By Order)
కూనపరాజు గోపాలకృష్ణంరాజు
భీమవరం వాది తరపు అడ్వకేట్,
ది.04-05-2025 శ్రీరామపురం,
భీమవరం